క్లుప్తంగా

పాత పెన్షన్ సాధన రాజకీయ అజెండా కావాలి



కొల్లిపర: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధన రాజకీయ అజెండా కావాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.మల్లేశ్వరరావు పిలుపు నిచ్చారు. మండలంలోని అన్నవరపులంక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని దశల వారీగా చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం యూటీఎఫ్ గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించే విషయంలో అన్ని రాజకీయపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.హనుమంతరావు, ఉపాధ్యాయులు కిరణ్, శ్యామ్‌కుమార్, ఖాన్, శ్రీనివాసరావునాయక్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన సుందరకాండ ప్రవచన యజ్ఞం



భాజీపేట(తెనాలి): రూరల్ మండల గ్రామం భాజీపేటలోని శ్రీరామ మందిరంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న సుందరకాండ ప్రవచన యజ్ఞం ఆదివారం రాత్రితో ముగిసింది. శ్రీమణికంఠ అభయాంజనేయస్వామి భక్తబృందం, మద్దినేని వెంకయ్య గురుస్వామి శిష్యబృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ వాస్తు, జ్యోతిష్య సిద్ధాంతి, ఆంజనేయ ఉపాసకులు అప్పికట్ల వెంకటేశ్వరరావు గత నెల 27వ తేదీ నుంచి సుందరకాండ ప్రవచనం చెప్పారు. భాజీపేట, పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొన్నారు. ప్రవచన యజ్ఞం ముగిసిన సందర్భంగా 300 మంది భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు హనుమాన్ చాలీసా పుస్తకాలను పంపిణీ చేశారు. అప్పికట్ల వెంకటేశ్వరరావును సత్కరించారు.

తైక్వాండో పోటీల్లో వినయ్‌కు బంగారు పతకం



తెనాలిఅర్బన్: నేషనల్ లెవల్ యూత్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించిన తైక్వాండో పోటీల్లో తెనాలిలోని యూనిక్ తైక్వాండో అకాడమీకి చెందిన కంభం వినయ్‌కు బంగారు పతకం లభించినట్లు కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈ నెల 1, 2, 3 తేదీల్లో వీటిని నిర్వహించినట్లు చెప్పారు. సోమవారం అకాడమీ వద్ద వినయ్‌కు పతకం, సర్టిఫికెట్‌ను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

8న కాంగ్రెస్ పార్టీ 'రచ్చబండ'

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఈ నెల 8న జరిగే 'రచ్చబండ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు కోరారు. గ్రామ పురవేదిక వద్ద జరిగే రచ్చబండలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు శశిధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కర్లపూడి బుల్లయ్య, మల్లవరపు ప్రసాద్, వల్లూరి సాంబయ్య, భీమా రమేష్, స్టీవెన్‌బాబు, శివన్నారాయణ, కోటేశ్వరరావు, సుబ్బారావు, వీరాస్వామి, అయ్యప్ప, శ్రీను, శివకుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కయాకింగ్ పోటీలకు పెనుమాక విద్యార్థి



తాడేపల్లిరూరల్: జాతీయ స్థాయి కానోయింగ్, కయాకింగ్ పోటీలకు పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వి.పూర్ణచంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు భోపాల్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్, జూనియర్ కానోయింగ్, కయాకింగ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి పి.ఆర్యచరణ్ పాల్గొనున్నట్లు చెప్పారు. జూనియర్ 200, 500 మీటర్ల కయాకింగ్ ఈవెంట్లకు అర్హత సాధించినట్లు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఆర్యచరణ్‌కు రూ.6వేల పారితోషకాన్ని అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రమేష్, హరికృష్ణను అభినందించారు.

అమ్మ ఒడి .. చదువుల ఒరవడి

- తల్లుల్లో ఆనందాల సవ్వడి
- వరుసగా 5వ ఏడాదీ పథకం అమలు
- కోరిన వారికి ల్యాప్‌టాప్‌లు
- మండలంలో అమ్మ ఒడి లబ్ధిదారులు 3,696 మంది



కొల్లిపర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కొల్లిపర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగేళ్ల నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకంతో నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులు పాఠశాలలకు దూరం కాకుండా చేస్తున్నారు. ఈ పథకాన్ని ఐదవ ఏడాది సైతం అందించేందుకు ప్రభుత్వం సమయాత్తమైంది. దీనిపై విద్యాశాఖతో పాటు సచివాలయ వ్యవస్థ ఇతర ప్రభుత్వ శాఖలు కసరత్తు ప్రారంభించాయి.

2022–23లో 3,696 మంది తల్లుల ఖాతాలకు ...

కొల్లిపర మండల స్థాయిలో ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న 3,696 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో గత ఏడాది ప్రభుత్వం రూ.5,54,40,000 జమ చేసింది. క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం అమ్మ ఒడి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయటం వలన పాఠశాలల్లో డ్రాపవుట్లు తగ్గటం వలన 2023–24 విద్యా సంవత్సరంలో లబ్ధిదారుల సంఖ్య సుమారు 150 మంది వరకు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కొల్లిపర మండలంలో అమ్మ ఒడి అందుకున్న వారి వివరాలు...

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	నగదు
2019–20	3,689	రూ.5,53,35,000
2020–21	3,750	రూ.5,62,50,000
2021–22	3,808	రూ.5,71,20,000
2022–23	3,696	రూ.5,54,40,000

జగనన్న వెంట ఉంటాం...



ఎంతో మంది ముఖ్యమంత్రులుగా వచ్చారు. పిల్లల చదువులను పట్టించుకోలేదు. జగనన్న మాత్రం అట్లాకా దు. అమ్మ ఒడి ఇచ్చారు. నా డు–నేడుతో స్కూళ్లను బాగు చేశారు. ప్రైవేటు స్కూళ్లకంటే గొప్పగా చేసినారు. మా పిల్లల చదువులకు అండగా నిలిచిన జగనన్న వెంట ఉండి మరల సీఎంగా గెలుపించుకుంటాం.

– కమర్తి జ్యోతి, విద్యార్థి తల్లి, మున్నంగి గ్రామం

మాట నిలబెట్టుకున్న సీఎం...



ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన మాటను అధికారంలోకి రాగానే నిలబెట్టుకున్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద ప్రతి సంవత్సరం పిల్లల తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తున్నారు. పిల్లల చదువు కోసం అప్పులు చేయాల్సిన అవసరం లేదు. జగనన్నే మా పిల్లలకు పెద్ద దిక్కుగా నిలిచారు. ఆయన చేసిన మేలును మరిచిపోము.

–అన్నవరపు నాగలక్ష్మి, విద్యార్థిని తల్లి, తూములూరు గ్రామం

అర్హులందరికీ అమ్మ ఒడి పథకం...



అమ్మ ఒడి పథకం అర్హులందరికీ వర్తిస్తుంది. ఇప్పటికే విద్యార్థుల తల్లుల నుంచి తీసుకున్న వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. నగదు లేదా ల్యాప్‌టాప్ ఏది కోరుకుంటే అది ఇస్తాం. అమ్మ ఒడి పథకం లబ్ధిదారులను కుదిస్తున్నారని, అర్హుల పేర్లను తొలగిస్తున్నారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ అపోహలు మాత్రమే. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు నమోదు చేయటం జరుగుతుంది.

– జి.సాల్మాన్‌రాజు ఎంఈవో–1 కొల్లిపర మండలం

మా పిల్లలకు మేనమామ సీఎం జగనన్న ...



మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. పిల్లల చదువుకు ఇబ్బందులు పడుతున్న సమయంలో సీఎం జగనన్న అధికారంలోకి వచ్చి మా పిల్లలకు అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందించడమే కాకుండా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా యూనిఫాం, బుక్స్ అందించారు. మా పిల్లలకు మేనమామగా నిలుస్తున్న జగనన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– కొల్లిపర సునీత విద్యార్థిని తల్లి, కొల్లిపర గ్రామం

అప్పల బాధ తీరింది...



గతంలో పాఠశాలలు తెరుస్తున్నారంటే యూనిఫాం, పుస్తకాలు కొనడానికి , ఫీజులు చెల్లించడానికి అప్పులు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు అమ్మ ఒడి పథకం పుణ్యమా అని ఆ బాధ తప్పింది. పిల్లల చదువుకోసం జగనన్న రూ.15వేలు అందించి పేద కుటుంబంలో ఉన్న ప్రతి విద్యార్థుల తల్లిదండ్రులను ఆదుకుంటున్నారు. ఇలాంటి ప్రభుత్వానికి మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– పిల్లి సరోజిని , విద్యార్థిని తల్లి, చివలూరు గ్రామం

స్పందన అర్జీలకు వ్యవధిలోగా పరిష్కారం



సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలి: వివిధ సమస్యలపై ప్రజలు స్పందనలో ఇచ్చే వినతిపత్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి కృషిచేస్తామని తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన స్పందన సమావేశంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మధ్యాహ్నం వరకు జరిగిన స్పందనలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తొమ్మిది సమస్యలపై అర్జీలను అందజేశారు. సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ ప్రతి అర్జీదారుని స్వయంగా పలకరించి, సమస్య వివరాలను తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని చెప్పారు. రెవెన్యూకు సంబంధించి ఐదు, పోలీసుశాఖ పరిధిలో మూడు, మున్సిపాలిటీకి చెందిన సమస్య ఒకటి చొప్పున మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చాయని వివరించారు. ఓటర్లు తమ ఓటుకు సంబంధించి మార్పులు, చేర్పులకు ఇప్పటికీ అవకాశం ఉందని సబ్‌కలెక్టర్ ప్రత్యేకంగా చెప్పారు. ఏవైనా మార్పులు, చేర్పులు అవసరమైనవారు సంబంధిత బీఎల్‌ఓలను సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్‌గా ఎస్.శ్రీనివాసరెడ్డి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా తెనాలి తహసీల్దార్ బదిలీ అయ్యారు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా ఉదయగిరి తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న రవిబాబు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

ముగిసిన సామాజిక పింఛన్ల పంపిణీ



వెంకయ్యమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనూష



పాండురంగారావుకు వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ యమున



రామమోహనరావు వికలాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సందీప్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. అందుబాటులో లేని లబ్ధిదారులను గుర్తించి వారికి వార్డు వలంటీర్‌లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు పింఛన్‌లు పంపిణీ చేశారు. బాలాజీరావుపేటకు చెందిన పెద్ది వెంకయ్యమ్మకు వృద్ధాప్య పింఛన్ వలంటీర్ ఎం.అనూష, ఉడా కాలనీకి చెందిన కొండెపు పాండురంగారావుకు వృద్ధాప్య పింఛన్‌ను వెల్ఫేర్ సెక్రటరీ ఆరాధ్యుల యమున, 19వ వార్డుకు చెందిన దర్శి రామమోహనరావుకు వికలాంగ పింఛన్‌ను వలంటీర్ సందీప్ పంపిణీ చేశారు.

క్షతగాత్రులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత



వాల్‌పోస్టర్ అతికిస్తున్న ఆర్టీవో ప్రసాద్, ఎంవీఐ రాఘవరావు

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి కె.ప్రసాద్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గుడ్ సమారిటన్ వాల్ పోస్టర్లను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల, పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలల్లో తెనాలి రవాణా శాఖ అధికారులు సోమవారం అతికించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి త్వరితగతిన వైద్య సహాయం అందించి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గాయాలపాలైన వారికి సహాయం అందించే వారిని ఉద్దేశించి గుడ్ సమారిటన్ వాల్ పోస్టర్లను రవాణా శాఖ రూపొందించిందని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని త్వరితగతిన వైద్యశాలలకు తరలించిన వారికి రూ.ఐదు వేలు నగదు ఇస్తారని చెప్పారు. క్షతగాత్రులను వైద్యశాలలకు తీసుకువచ్చిన వారిని ఫారాలు నింపాలని, వైద్య ఖర్చులు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదని, వారిని వైద్యశాల నుంచి వెళ్లేందుకు అభ్యంతరం చెప్పకూడదని స్పష్టం చేశారు. బాధితులను ఆదుకున్న వారిని సాక్షులుగా ఉండాలని పోలీసులూ ఒత్తిడి చేసేందుకు వీలు లేదని, అవసరమైతే సాక్షిగా ఉండేందుకు అంగీకరిస్తారా అని వారిని అడిగి వారి సమ్మతంతోనే సాక్షిగా పోలీసులు చేరుస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి 10 మంది గుడ్ సమారిటన్‌లను ఎంపిక చేసి ట్రోఫీ, సర్టిఫికెట్‌తో పాటు రూ.లక్ష నగదు ప్రోత్సాహంగా అందిస్తుందని తెలిపారు. ఆయన వెంట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, సిబ్బంది ఉన్నారు.

రెడ్‌క్రాస్ సంస్థకు సహకారం అందించండి



తెనాలిఅర్బన్: తెనాలి రెడ్‌క్రాస్ సంస్థ చేస్తున్న సేవలకు సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను సంస్థ ప్రతినిధులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో సంస్థ ప్రతినిధులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి ముమ్మనేని భానుమతి, ప్రతినిధులు పెనుగొండ వెంకటేశ్వరరావు, కుర్రా శ్రీను, నాళ్ళం శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో నెహ్రూనికేతన్ స్వర్ణోత్సవాలు

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల స్వర్ణోత్సవాలను ఈనెల 7, 8 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ సోమవారం వివరాలను తెలియజేశారు. తమ సంస్థల ప్రాంగణంలోనే రెండురోజులు జరిగే స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఏడో తేదీ సాయంత్రం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య పి.రాజశేఖర్, గౌరవ అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని తెలిపారు. 8వ తేదీ సాయంత్రం జరిగే ఉత్సవంలో ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు, గౌరవ అతిథిగా దక్షిణ భారతదేశ లీడ్ స్కూల్ జోనల్ అకాడమీ ఎక్సలెన్స్ డైరెక్టర్ లోలుక్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

జోసిల్‌లో మాక్ డ్రిల్

మేడికొండూరు: మండల పరిధిలోని జోసిల్ పరిశ్రమలో అత్యవసర పరిస్థితులను ఏవిధంగా అధిగమించాలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందం ఆధ్వర్యంలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. క్లోరిన్ గ్యాస్ లీక్ అవుతున్న పరిస్థితి ఏవిధంగా అధిగమించాలో ప్రాక్టికల్‌గా ఎన్డీఆర్‌ఎఫ్ బృందం చూపించారు. జోసిల్ పరిశ్రమ సిబ్బందితో ప్రాక్టికల్ చేయించారు. కెమికల్ డిజాస్టర్ కింద జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ శివకుమార్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి శ్రీధర్‌బాబు, ఎన్డీఆర్‌ఎఫ్ కమాండెంట్ భూపేంద్రకుమార్, భద్రతా అధికారి సుజిత్, జోసిల్ కంపెనీ సెక్రటరీ కోటా రఘురామ్, ప్రొడక్షన్ అడ్వైజర్ రామినేని బెనర్జి బాబు, యడ్లపాటి భానుప్రసాద్ పాల్గొన్నారు.

కొల్లిపర మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు



కొల్లిపర మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొల్లిపర: కొల్లిపర మండల తహసీల్దార్‌గా నాగినేని శ్రీనివాసులు సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నిబంధనల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా , సైదాపురం మండలం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ జి.నాంచారయ్య తిరుపతి జిల్లా, ఓజిలి మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు అన్ని సేవలు అందిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా సజావుగా జరిగే విధంగా తన వంతు ముందస్తు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం ఆర్ఐ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు(సాయి), ఏఎస్‌వో మనోహరరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కోటినాగకిరణ్, కంప్యూటర్ ఆపరేటర్ ఈమని సురేంద్రరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల వీఆర్‌వోలు, ప్రజా ప్రతినిధులు ఆయనను కలసి అభినందనలు తెలిపారు.

ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'వీరస్థలి తెనాలి' చిత్రం



వీరస్థలి తెనాలి చిత్రంలోని సన్నివేశం (ఫైల్)

తెనాలి: స్వాతంత్ర్య యోధుడు, తెనాలి ప్రాంతానికి చెందిన చుక్కపల్లి రామయ్య సాహసంపై తీసిన దేశభక్తి చిత్రం 'వీరస్థలి తెనాలి'కి ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. సాధారణ రైతు అయిన రామయ్య దేశ స్వాతంత్ర్య కాంక్షతో..తన స్నేహితులను కలుపుకుని అప్పటి బ్రిటిష్ పాలకుడు వైస్రాయ్ ప్రయాణిస్తున్న రైలు కింద బాంబు పెట్టేందుకు సన్నాహం చేశారు. ట్రయల్ రన్‌లో ఆ బాంబు పేలి అటుగా వెళ్తున్న ఒకరు చనిపోయారు. స్వరాజ్య ఉద్యమంలో తొలి ప్రతి ఘటనగా నమోదైన ఈ కేసులో రామయ్య అండమాన్ జైలులో ద్వీపాంతర శిక్షను అనుభవించారు. ఈ చరిత్ర ఆధారంగా సుజాత ఆర్ట్ పిక్చర్స్ బ్యానర్‌పై గల్లా జ్ఞానశేఖర్ నిర్మాతగా, పట్టణానికి చెందిన దర్శకుడు కనపర్తి రత్నాకర్ 'వీరస్థలి తెనాలి' పేరుతో సినిమా తీశారు. సహజ కవి అయినాల మల్లేశ్వరరావు కథను సమకూర్చారు. ఈ దేశభక్తి చిత్రాన్ని ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసి, ధ్రువీకరణ పత్రాన్ని పంపారు. తమ చిత్రానికి గుర్తింపుపై యూనిట్ హర్షం వ్యక్తం చేసింది. పలువురు ప్రముఖులు దర్శకుడు రత్నాకర్‌ను, చిత్ర బృందాన్ని అభినందించారు. గతంలో ఇదే చిత్రం 'మిరాకిల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదుకాగా, అప్పటి రాష్ట్ర హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత చేతుల మీదుగా ధ్రువీకరణను అందుకున్నారు. తమ బ్యానర్ పైనే రత్నాకర్ దర్శకత్వంలో పూర్తిస్థాయి కమర్షియల్ సినిమాను రూపొందిస్తున్నట్లు ఈ సందర్భంగా నిర్మాత జ్ఞానశేఖర్ తెలిపారు.

వాలీబాల్‌లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో వాలీబాల్ క్రీడాకారులు సత్తాచాటాలని వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో మంగళగిరి నియోజకవర్గం నుంచి వాలీబాల్ రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్టు సభ్యుల అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ, సచివాలయాల పరిధిలో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు వాలీబాల్ కిట్, షూస్ అందజేశారు. కార్యక్రమంలో పీడీలు రమేష్, సాంబశివరావు, పీఈటీలు రజని నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం, సీపీఐ నేతలపై కేసు కొట్టివేత

తాడేపల్లిరూరల్: సీపీఎం, సీపీఐ నేతలపై పెట్టిన కేసును కొట్టివేస్తూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష సోమవారం తీర్పు నిచ్చారు. ఆ పార్టీల నాయకులు ఎం.రవి, డి.వెంకట రెడ్డి, కంచర్ల కాశయ్య మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2018లో తాడేపల్లి పోలీసులు వివిధ సెక్షన్ల కింద తమపై కేసు నమోదు చేశారని, సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేశారని చెప్పారు.

డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింట్ అయిన కర్రా సుధారాణి భర్త కర్రా ఏడుకొండలు, ఐతానగర్, తెనాలి నివాసి వారి తల్లి మేరీ దేవకరుణ గారి ఆస్తి తాలూకా ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్ నెం: 12434/ 2013 సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ మెడికల్‌లో రిజిస్టర్ కాబడినది. తెనాలి స్టేషన్‌రోడ్‌లో జిరాక్స్ నిమిత్తం తీసుకువెళ్తుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన ఎడల తెలియజేయగలరు.
బ్రెవ్‌హం సీఖా, Advocate తెనాలి
కర్రా సుధారాణి – 9177874171

పేకాట శిబిరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టణ సీఎం కాలనీ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 20,070, సెల్‌ఫోన్‌లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే స్టేషన్‌లోని నాలుగు, ఐదు ప్లాట్‌ఫాంల మధ్య వ్యక్తి మృతి చెంది ఉన్నాడని వచ్చిన సమాచారంతో జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని సోమవారం పరిశీలించారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మరో ఘటనలో పెదవడ్లపూడి వద్ద పట్టాలు దాటుతున్న అదే గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు(70)ను రైలు ఢీకొట్టడంతో ఇంజిన్‌లో ఇరుక్కుని ఆదివారం రాత్రి మృతి చెందాడు. దుగ్గిరాల వద్దకు వచ్చాక లోకో పైలట్ గమనించి మృతదేహాన్ని ఇంజిన్ నుంచి దింపారు. తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహ నిర్వాహకుడి అరెస్ట్

తెనాలిరూరల్: వ్యభిచార గృహ నిర్వాహకుడు, ఓ విటుడిని పోలీసులు అరెస్ట్ చేసి ఓ మహిళను రక్షించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కిషోర్ సుల్తానాబాద్‌లో ఇల్లును అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు కిషోర్‌తో పాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకుని ఇంట్లో ఉన్న మహిళను స్వధార్ హోంకు తరలించారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఇసుక లారీలు సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రెండు లారీలు పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు గుర్తించి వాటిని సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

'అర్చక వైభవరత్న' అళహరి రవికుమార్



తెనాలి: పట్టణానికి చెందిన శ్రీలక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురం సీనియర్ అర్చకుడు అళహరి రవికుమార్ అర్చక వైభవరత్న బిరుదుతో సత్కారం అందుకున్నారు. తిరుపతిలో గల సేవాసాంస్కృతిక సంస్థ సీవీ రామన్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం అక్కడి వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని వేంకటేశ్వర స్టేడియంలో వివిధ రంగాల్లోని ప్రముఖులను సత్కరించారు. తెనాలి అర్చకుడు అళహరి రవికుమార్ అర్చక వైభవరత్న బిరుదు స్వీకరించారు. అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మహేంద్రవాడ వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి చేతులమీదుగా ఈ గౌరవాన్ని అందుకున్నారు.